ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ మంగళవారం 23-12-2025 సంపుటి : 1 సంచిక :186 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## ఉక్రెయిన్‌పై పుతిన్ సంచలన ప్రకటన



వార్షిక మీడియా భేటీలో రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడి

# కొత్త బడ్జెట్‌కు త్వరలో ప్రతిపాదనలు

## ప్రస్తుత ఏడాది ఆదాయ లక్ష్యాల సాధన కష్టమేనా?

## మార్చికి రూ.2.60 లక్షల కోట్ల ఆదాయం!



హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరం(2026-27) బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్ర ఆర్థికశాఖ ద ృష్టి సారించింది. వచ్చే ఫిబ్రవరి లేదా మార్చిలో శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కొత్త బడ్జెట్‌కు ప్రతిపాదనలు పంపాలని అన్నిశాఖలకు త్వరలో ఉత్తర్వులు జారీకానున్నాయి. అవి అందిన తర్వాత శాఖల వారీగా మంత్రులు, కార్యదర్శులతో ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు జరిపి బడ్జెట్ కేటాయింపుల అంచనాలపై చర్చించనున్నారు. ప్రస్తుత ఏడాది పన్నుల ద్వారా రూ.1.75 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఈ ఏడాది(2025-26) బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు రూ.లక్ష కోట్ల వరకు వచ్చినట్లు అంచనా. మార్చి నాటికి పన్నుల వసూళ్లు బాగా పుంజుకుంటాయని సీనియర్ అధికారులు తెలిపారు. మిగతా..2లో



## 'కేసీఆర్ ఎలా ఉన్నారు?'..

- పార్లమెంట్‌లో ప్రధానితో భేటీ అయిన బీఆర్ఎస్ ఎంపీలు
- సిరిసిల్ల-కోరుట్ల జాతీయ రహదారి విస్తరణపై వినతిపత్రం
- ప్రధాని ఆసక్తిపై రాజకీయ వర్గాల్లో మొదలైన చర్చ



# 27 లేదా 28 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

- మూడు రోజులపాటు సమావేశాలు జరిగే అవకాశం
- 7 ఆర్డినెన్స్‌ల స్థానంలో బిల్లులు ప్రవేశపెట్టనున్న సర్కారు
- జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు ఎలా?
- అన్ని రాజకీయ పక్షాల నుంచి అభిప్రాయాల కోసం చర్చ

హైదరాబాద్: ఈనెల 27 లేదా 28వ తేదీన అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. ఈ సమావేశాలను మూడు రోజులపాటు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలి సింది. ఇందుకోసం సీఎం అధ్యక్షతన ఈనెల 22న అనధికారిక మంత్రివర్గ సమావేశం జరగనున్నట్లు తెలిసింది. సచివాలయంలో మధ్యాహ్నం జరిగే ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల తేదీలను ప్రకటించడంతోపాటు ఎన్ని రోజులు నిర్వహించాలన్న అంశంపై కూడా స్పష్టతనివ్వను న్నట్లు సమాచారం. మిగతా..2లో

## సహజీవనంపై హైకోర్టు కీలక తీర్పు..

# ఎవరికి ఓకే? ఎవరికి కాదు?



సహజీవనంపై అలహాబాద్ హైకోర్టు రెండు కీలక తీర్పులు
అవివాహిత మేజర్లు కలిసి జీవించడం నేరం కాదన్న న్యాయస్థానం
విడాకులు తీసుకోకుండా సహజీవనం చేస్తే చట్టవిరుద్ధమని స్పష్టీకరణ

# 11.49 కోట్ల మందిలో 1.71 కోట్ల పేర్లు తొలగింపు



తమిళనాడు, గుజరాత్ ముసాయిదా ఓటరు జాబితాపై ఈసీ వెల్లడి

# లక్ష్యం చేరాలంటే వచ్చే మూడు నెలలు కీలకం

## రాష్ట్ర సొంత రాబడి రూ.67,235 కోట్లు

## కిందటి ఆర్థిక సంవత్సరం కన్నా 4% అదనం



అమరావతి: రాష్ట్ర సొంత రాబడి ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 10 వరకు రూ.67,235 కోట్లుగా నమోదైంది. లక్ష్యం రూ.1,34,208 కోట్లలో ఎనిమిది నెలల కాలానికి దాదాపు సగం సాధించినట్లయింది. ప్రస్తుతం డిసెంబరు నెల చివరికి వచ్చింది. ఈ నెల పూర్తయితే మూడు త్రైమాసికాలు ముగిసినట్లే. జనవరి నుంచి మార్చి వరకు చివరి త్రైమాసికంలో సొంత రాబడులు పెరిగేలా చూడాలని ఆర్థిక శాఖ అధికారులు జిల్లా యంత్రాంగాలకు నిర్దేశిస్తున్నారు. ఏ జిల్లాలో ఏ విభాగం నుంచి ఎంత ఆదాయం వచ్చింది.. గతంలో ఎంత ఉంది.. ఎక్కడ నుంచి అధిక ఆదాయం రాబట్టే ఆస్కారం ఉంది.. మిగతా..2లో

# 'వైనాట్ 175' అన్నారు... 'టీమ్ 11'కే పరిమితం అయ్యారు!

- మంగళగిరితో పోటీ... ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరిస్తున్నా
- మంగళగిరితో పోటీ పడతామన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సవాల్ స్వీకరించిన లోకేశ్
- కష్టకాలంలో అండగా నిలిచిన ఆదిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటా
- ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోంది
- జగన్ బెదిరింపులకు భయపడేది లేదు



అమరావతి: అభివ ృద్ధిలో, పార్టీ బలోపేతం చేసే విషయంలో మంగళగిరి నియోజకవర్గంతో పోటీ పడతామంటూ రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేసిన సవాల్‌ను తాను మనసూర్తిగా స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ప్రేమతో ప్రజల మనసులను గెలుచుకుంటూ, మిగతా..2లో



## అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ..

- రాష్ట్రాభివృద్ధి, రాజకీయాలపై చర్చ
- రాష్ట్రంలోని ప్రాజెక్టుల పురోగతి, పెట్టుబడులపై వివరణ
- జగన్ పాలనతో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి
- తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య చర్చలు మిగతా..2లో



## సంప్రదాయ వైద్యానికి సముచిత స్థానం దక్కాలి

- శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలవాల్సి ఉంది
- సైన్స్ ద్వారా నమ్మకాన్ని పెంచుకోవాలి. మరింతగా ప్రజాబాహుళ్యంలోకి వెళ్లాలి'
- లైఫ్‌స్టయిల్ విధానాలకు మాత్రమే సంప్రదాయ వైద్య పరిమితమనే నమ్మకం ఒకప్పుడు ఉండేది



## హైదరాబాద్‌లో మారనున్న 3 వేల కాలనీల చిరునామాలు!

- జీహెచ్ఎంసీలో 27 శివారు పురపాలికల విలీనం
- 2053 చదరపు కిలోమీటర్లకు పెరిగిన గ్రేటర్ పరిధి
- డివిజన్ల పునర్విభజనపై త్వరలో తుది గెజిట్ విడుదల
- 2027 జనాభా లెక్కల తర్వాత మరోసారి పునర్విభజన అవకాశం

# ఈసారి బడ్జెట్‌ను ఆదివారం ప్రవేశపెట్టనున్న సీతారామన్!



దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి బడ్జెట్‌ను ఏ రోజు పార్లమెంటులో ప్రవేశపెడతారన్నది ఆసక్తికరంగా మారింది. 2017 నుంచి కేంద్ర ప్రభుత్వం సాధారణ బడ్జెట్‌ను ఏటా ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1- ఆదివారం. ఆనవాయితీని కొనసాగించాలనుకుంటే సీతారామన్ 2026-27 బడ్జెట్‌ను అదే రోజు పార్లమెంటు ముందుకు తీసుకొస్తారు. అది జరిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును ప్రశ్నించగా.. "ఇలాంటి నిర?యాలను పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ తగిన సమయంలో తీసుకుంటుంది" అని బదులిచ్చారు. 2017కు ముందు- ఏటా ఫిబ్రవరి చివరి రోజున జనరల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. ఇప్పటివరకూ కొవిడ్ మహమ్మారి విజ ృంభణ వంటి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే పార్లమెంటు ఆదివారం సమావేశమైంది.

# 'వైనాట్ 175' అన్నారు...'టీమ్ 11'కే పరిమితం అయ్యారు!

మొదటి పేజి తరువాయి

వారితో మమేకమై ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రాజమండ్రిలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన రాజమండ్రి పట్టణ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన ఆదిరెడ్డి కుటుంబాన్ని జీవితంలో మర్చిపోలేనని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. "చంద్రబాబు గారిని 53 రోజుల పాటు అక్రమంగా ఇదే రాజమండ్రి జైలులో బంధించినప్పుడు ఆదిరెడ్డి కుటుంబం మాకు అండగా నిలిచింది. శాసనసభలో నా తల్లిని అవమానించినట్లే, ఆదిరెడ్డి భవానీ గారిని కూడా అవమానించారు. ఎన్నో ఇబ్బందులు పెట్టినా, జై తెలుగుదేశం నినాదానికే ఆ కుటుంబం కట్టుబడింది. నాడు, నేడు, ఎప్పుడూ టీడీపీ కూడా ఆదిరెడ్డి కుటుంబానికి అండగా నిలుస్తుంది" అని లోకేశ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును తన కుటుంబ సభ్యుడిలా భావిస్తానని ఆయన స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం ప్రతి హామీని నిలబెట్టుకుంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందని లోకేష్ తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తుచేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. 150 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసి 16 వేల ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని చెప్పారు. "ఏపీకి బ్రాండ్ చంద్రబాబు నాయుడు గారే. ఆయన నాయకత్వం వల్లే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి," అని అన్నారు.

'వైనాట్ 175' అన్నారు... ఇప్పుడు 'టీమ్ 11'కే పరిమితం అయ్యారు!

రాష్ట్రంలో ఓ సైకో ఇంకా అరెస్టులు చేస్తానని బెదిరిస్తున్నాడని, అలాంటి బెదిరింపులకు భయపడేది లేదని లోకేశ్ పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "53 రోజులు మా నాయకుడిని జైల్లో పెట్టి ఏం సాధించారు? మీ కంటే ముందు చాలా మంది పెద్ద మాటలు మాట్లాడారు, వారి పరిస్థితి ఏమైందో గుర్తుంచుకోవాలి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదు" అని హెచ్చరించారు. 'వై నాట్ 175' అన్నవారు ఇప్పుడు 'టీమ్ 11'కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.తెలుగుజాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటుందని, పార్టీని ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. కుప్పం, హిందూపురంలాగే రాజమండ్రిని కూడా టీడీపీకి కంచుకోటగా మార్చాలని, చరిత్ర సృష్టించాలన్నా, తిరగరాయాలన్నా అది టీడీపీతోనే సాధ్యమని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# కొత్త బడ్జెట్‌కు త్వరలో ప్రతిపాదనలు

మొదటి పేజి తరువాయి

మార్చికి రూ.2.60 లక్షల కోట్ల ఆదాయం!

గతేడాదికన్నా 10 శాతం అదనంగా పన్నుల ఆదాయం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలుస్తోంది. 2024-25 బడ్జెట్‌లో పన్నుల ద్వారా రూ.1.64 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని లక్ష్యాన్ని పెట్టుకోగా చివరికి రూ.1.40 లక్షల కోట్లు వచ్చింది. ఈ ఏడాది కూడా రూ.లక్షన్నర కోట్లు రావచ్చని అధికార వర్గాలు తెలియజేస్తున్నాయి. వచ్చే ఏడాది బడ్జెట్‌కు పన్నుల ద్వారా ఆదాయ లక్ష్యాలను ప్రభుత్వం మరింత పెంచుతుందా లేక రూ.1.75 లక్షల కోట్లకే పరిమితం చేస్తుందా అనేది పన్నుల వసూళ్ల శాఖలు ఇచ్చే ప్రతిపాదనలను బట్టి తేలనుంది. గ్లోబల్ సమిట్, మూసీ పునరుజ్జీవం, ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) వంటి వాటితో ప్రధానంగా వచ్చే ఏడాది రియల్ ఎస్టేట్ రంగం మరింత పుంజుకుంటుందని రిజిస్ట్రేషన్లపై ఆదాయం బాగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఏడాది పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి గ్రాంట్లు కలిపి రూ.53 వేల కోట్లకు పైగా రావచ్చని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు రూ.11 వేల కోట్లలోపే వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త బడ్జెట్‌లో వీటిని మరింత పెంచాలా లేదా ఇదే స్థాయిలో కొనసాగించాలా అనే చర్చ సాగుతోంది. అన్నిశాఖల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తామని, అవి అందిన తర్వాత ఆదాయ లక్ష్యాల అంచనాల్లో మార్పులుంటాయని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.2.84 లక్షల కోట్ల ఆదాయం రావాలి. కానీ మార్చి నాటికి ఇది రూ.2.60 లక్షల కోట్లకు పరిమితం కావచ్చని, దీన్ని బట్టి కొత్త బడ్జెట్ ప్రతిపాదనలుంటాయని అధికారులు తెలిపారు.

# ఉక్రెయిన్‌పై పుతిన్ సంచలన ప్రకటన

మాస్కో: ఉక్రెయిన్‌లో ఆశించిన సైనిక లక్ష్యాలను సాధిస్తామన్న నమ్మకం తనకు ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రష్యా బలగాలు యుద్ధక్షేత్రంలో ముందుకు సాగుతున్నాయని ఆయన ప్రకటించారు. ఇప్పటికే వ్యూహాత్మకంగా పైచేయి సాధించాయని, ఈ ఏడాది చివరి నాటికి మరిన్ని ప్రాంతాలను కైవసం చేసుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పైకి దండెత్తి దాదాపు నాలుగేళ్లవుతున్న సందర్భంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఆయన వార్షిక మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు సైతం నేరుగా లైవ్‌లో సమాధానాలిచ్చారు. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ యుద్ధానికి ముగింపు పలికేలా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్న వేళ పుతిన్ ఏం మాట్లాడుతారా అని పరిశీలకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 2022 ఆరంభంలో పెద్ద ఎత్తున దండెత్తి వచ్చిన రష్యా బలగాలను చాలా చిన్నదైన ఉక్రెయిన్ ఆర్మీ సమర్థంగా తిప్పికొట్టగలిగినప్పటికీ, రాన్రానూ అత్యంత భారీ రష్యా ఆర్మీ, అధునాతన ఆయుధ సంపత్తి ముందు తలొంచక తప్పలేదు. రష్యా బలగాలు యుద్ధ క్షేత్రంలో మెరుపు వేగంతో చొచ్చుకుపోలేకున్నా, క్రమంగా పైచేయి సాధిస్తూ ముందుకు సాగుతున్నాయి. దీనిపై పుతిన్ మాట్లాడుతూ.. 'మా బలగాలు యుద్ధక్షేత్రమంతటా ముందుకు వెళ్తున్నాయి. ఒక్కో చోట వేగంగా, మరోచోట నెమ్మదిగా వెళ్తున్నాయి. మొత్తమ్మీద శత్రువు వెనక్కి మరలుతున్నాడు'అని పేర్కొన్నారు. ఈ సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించేందుకు శాంతియుతమైన ఒప్పందం కోసం తాము సిద్ధంగా ఉన్నామన్నారు. స్తంభింపజేసిన రష్యా ఆస్తుల్ని విక్రయించి, ఆ సొమ్మును ఉక్రెయిన్‌కు సాయంగా ఇవ్వాలంటూ పశ్చిమదేశాలు చేస్తున్న ప్రయత్నాలను పుతిన్ తప్పుబట్టారు. దీనిని పశ్చిమ దేశాలు సాగిస్తున్న దోపిడీగా అభివర?ంచారు. యూరోజోన్‌పై వ్యాపార, పారిశ్రామికవేత్తలపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందన్నారు.

ఉక్రెయిన్‌కు 90 బిలియన్ యూరోల సాయం

ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక అవసరాల కోసం వడ్డీలేని రుణాన్ని అందించడానికి యురోపియన్ యూనియన్ (ఈయూ) నాయకులు అంగీకరించారు. 2026%--%27 సంవత్సరానికి ఉక్రెయిన్‌కు 90 బిలియన్ యూరోల సాయం చేసేందుకు ఈయూ కట్టుబడి ఉందని కౌన్సిల్ అధ్యక్షుడు అంటోనియో కోస్టా తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌లో వెల్లడించారు. ఈ ఒప్పందానికి రావడానికి ఈయూ నాయకులు తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. ఈయూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశం ముందున్న బడ్జెట్ లోటును ఇది పూడుస్తుందని, తమ దేశ రక్షణను బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు.

# లక్ష్యం చేరాలంటే వచ్చే మూడు నెలలు కీలకం

మొదటి పేజి తరువాయి

అనే అంశాలను ఆర్థిక శాఖ అధికారులు కలెక్టర్లకు అందుబాటులో ఉంచారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతి మూడు నెలలను ఒక సమీక్షగా తీసుకుంటారు. మొత్తం నాలుగు త్రైమాసికాలుగా విశ్లేషిస్తారు. తొలి రెండు త్రైమాసికాల్లో రాష్ట్ర రాబడి కిందటి ఏడాది కన్నా అధికంగానే ఉందని పేర్కొంటున్నారు. నవంబరులో జీఎస్టీ 2.0 ప్రభావం కొంతమేర పడి ఆ వసూళ్లలో 2% మేర తగ్గుదల కనిపించింది. డిసెంబరు ప్రారంభం వరకు ఉన్న లెక్కల ప్రకారం.. గనులు, భూగర్భవనరులు మినహా మిగిలిన అన్ని శాఖల నుంచి రాబడి ఆశించినట్లుగా ఉందని విశ్లేషించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం ఆశించిన దానికన్నా ఎక్కువ ఉంది. నవంబరు నెలాఖరు వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం లక్ష్యంతో పోలిస్తే 110% మేర రాబడులు సాధ్యమయ్యాయి.

రిజిస్ట్రేషన్ల రాబడి భేష్

రిజిస్ట్రేషన్ల రాబడి లక్ష్యం కన్నా అధికంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు నెలాఖరు వరకు రూ.6,508.16 కోట్లు లక్ష్యం కాగా రూ.7,194.33 కోట్లు సాధించింది. కిందటి ఏడాది ఇదే సమయానికి అది రూ.5,465.79 కోట్లు మాత్రమే. మొత్తంగా 31.62% ఆదాయం కిందటి ఏడాది కన్నా అధికంగా లభించింది. రవాణా రంగంలో నవంబరు నెలాఖరు వరకు రూ.3,197.61 కోట్ల రాబడి దక్కింది. కిందటి ఏడాది ఇదే సమయానికి రూ.3,060.49 కోట్లే. అదనంగా 4.48% మేర సాధించారు. అటవీ శాఖ నుంచి అధిక ఆదాయం ఆశించినా వచ్చింది స్వల్పమే.. రూ.400 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం కాగా, కేవలం రూ.38.628 కోట్లు మాత్రమే దక్కింది. ఎర్రచందనం వేలం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం ఆశించినా.. అందుకు వీలు చిక్కలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత రాబడి లక్ష్యం: 1,34,208 కోట్లు, ప్రస్తుతం సాధించింది: 67,235 కోట్లు, ఇంకా సాధించాల్సింది: 66,973 కోట్లు, 2024-25 డిసెంబరు 10 వరకు వచ్చింది: 64,688 కోట్లు.

# 27 లేదా 28 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

అలాగే జిల్లా పరిషత్ ఎన్నికలకు ఎప్పుడు వెళ్లాలన్న అంశంతోపాటు, బీసీ రిజర్వేషన్ల అంశంపై మరోసారి చర్చించనున్నట్లు అధికారవర్గాల సమాచారం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఎలా అమలు చేయాలన్న దానిపై మరోసారి అసెంబ్లీలో చర్చించి.. అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. 42 శాతం రిజర్వేషన్ల అంశం ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, తీర్పు వచ్చేవరకు వేచి ఉండటమా..? లేక రాజకీయ పార్టీల నిర్ణయం తీసుకుని జెడ్పీ ఎన్నికల్లో ముందుకు వెళ్లడమా అనే దానిపై చర్చించనున్నారు. కాగా, గత అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత తెచ్చిన మొత్తం ఏడు ఆర్డినెన్స్‌ల స్థానంలో అసెంబ్లీలో ఆయా బిల్లులను ప్రవేశపెట్టనున్నారు. అందులో రెండు జీహెచ్ఎంసీ చట్ట సవరణలు, అలాగే మున్సిపాలిటీల చట్ట సవరణ, ప్రభుత్వ ఉద్యోగుల నియామకం.. వేతనాల చట్ట సవరణ, కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన సవరణ బిల్లు, తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీసెస్ బిల్లు, ప్రైవేట్ యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లులను అసెంబ్లీలో చర్చించి ఆమోదించనున్నారు. ప్రభుత్వం తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పాలక మండళ్లను రద్దు చేసిన నేపథ్యంలో సోమవారం జరిగే అనధికార మంత్రివర్గ సమావేశంలో వీటికి ఎన్నికల నిర్వహణపై కూడా చర్చించనున్నట్లు తెలిసింది.

## కర్ణాటకలో విందు రాజకీయాలు..

# ఒకే రోజు రెండు చోట్ల భేటీ

బెళగావి,: బెళగావిలోని ప్రజా పనుల శాఖ మంత్రి సతీశ్ నివాసంలో గురువారం రాత్రి సీనియర్ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు కొందరు పాల్గొన్న విందు సమావేశానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరు కావడంతో రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై మళ్లీ ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ విందు సమావేశంలో సీనియర్ మంత్రులు పరమేశ్వర, మహదేవప్ప, జమీర్ అహ్మద్ ఖాన్, ఎంసీ సుధాకర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏఎస్ పొన్నన్న తదితరులు పాల్గొన్నట్లు తెలిసింది. విందులో పాల్గొన్న వారంతా సిద్ధరామయ్యకు పార్టీలో అత్యంత సన్నిహితులుగా పేరు పొందారు. ముఖ్యమంత్రి న్యాయ సలహాదారు, ఎమ్మెల్యే ఏఎస్ పొన్నన్న విలేకరుల వద్ద స్పందిస్తూ ఇది చాలా సాధారణ సమావేశమేనని చెప్పారు. అయితే ఈ విందు సమావేశం తర్వాత అదే రోజు రాత్రి బెళగావిలోని ఓ హొటల్‌లో మరో సమావేశం జరగడం విశేషం. జార్కిహొళి ఆతిథ్యమిచ్చిన ఈ విందు సమావేశంలో 30 మందికిపైగా భావ సారూప్యం ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సిద్ధరామయ్య హాజరు కానప్పటికీ ఆయన కుమారుడు, ఎమ్మెల్సీ యతీంద్రతోపాటు మరో విధేయుడు ఎమ్మెల్యే కేఎన్ రాజన్న పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో వరుసగా రెండు విందు సమావేశాలు జరగడం చర్చనీయాంశంగా మారింది.

సీఎంగా నేనే కొనసాగుతా: సిద్ధూ

తనకు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు మధ్య రెండున్నరేండ్ల అధికార పంపకం ఒప్పందం ఉన్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం తోసిపుచ్చారు. ముఖ్యమంత్రిగా తానే ఐదేండ్ల పాటు కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు.

సీఎంకు, నాకూ మధ్య అవగాహన: డీకేఎస్

రాష్ట్రంలో నాయకత్వం మార్పుపై సూటిగా జవాబివ్వడానికి నిరాకరించిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కాంగ్రెస్ అధిషా'నం జోక్యంతో తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఓ అవగాహనకు వచ్చామని, తామిద్దరం దానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. పార్టీ హైకమాండ్ నిర?యం మేరకు సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆయన పదవీకాలంపై తాను ఎన్నడూ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని డీకేఎస్ స్పష్టం చేశారు.

# ఆర్థిక పరిస్థితులపై ఆర్బీఐ చర్చ

హైదరాబాద్, డిసెంబర్ 19: దేశ, విదేశీ ఆర్థిక పరిస్థితులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కేంద్ర బోర్డు చర్చించింది. ఇక్కడ ఆర్బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల 620వ సమావేశం జరిగింది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఈ మీటింగ్ నడిచింది. ఈ సందర్భంగా ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న ఆర్థిక విపత్కర పరిస్థితులు, సవాళ్లపై చర్చ చేపట్టారు. అలాగే కొన్ని సెంట్రల్ ఆఫీస్ విభాగాల కార్యకలాపాలు, గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను దేశీయ బ్యాంకింగ్ ప్రగతి, తీరుతెన్నుల డ్రాఫ్ట్ రిపోర్టును సమీక్షించారు. కాగా, బ్యాంకుల కోసం రిస్క్ ఆధారిత డిపాజిట్ ఇన్సూరెన్స్ విధివిధానాలను బోర్డు ఆమోదించినట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లు టీ రవి శంకర్, స్వామినాథన్ జే, పూనమ్ గుప్తా, శిరీష్ చంద్ర ముర్ము హాజరయ్యారు. సెంట్రల్ బోర్డు డైరెక్టర్లుగా ఉన్న ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి నాగరాజు మద్దిరాల, సతీష్ కే మరాఠే, రేవతి అయ్యర్, పంకజ్ రమణ్‌భాయ్ పటేల్, రవీంద్ర హెచ్ ధోలాకియాలు హాజరయ్యారు.

## తిరుమల పరకామణి కేసు..

# హైకోర్టు కీలక సూచనలు

తిరుపతి: తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయంలోని పరకామణి (కానుకల లెక్కింపు) విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. కానుకల లెక్కింపులో అవినీతి, చోరీలు, నిధుల దుర్వినియోగాన్ని నిరోధించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి మానవ ప్రమేయాన్ని తగ్గించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. పరకామణిలో సంస్కరణలను రెండు దశల్లో చేపట్టాలని హైకోర్టు నిర్దేశించింది. తక్షణ చర్యల్లో భాగంగా హుండీల సీలింగ్, రవాణా, లెక్కింపు ప్రక్రియల్లో భద్రతాపరమైన మార్పులపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఇక శాశ్వత ప్రణాళికలో భాగంగా కానుకల వర్గీకరణ, విదేశీ కరెన్సీ గుర్తింపు, విలువైన లోహాలు, రాళ్లను వేరు చేయడం కోసం ఏఐ ఆధారిత సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందుకోసం సాంకేతిక నిపుణులను నియమించుకోవాలని, అవసరమైతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులైన నిపుణుల సహాయం తీసుకోవాలని పేర్కొంది. ఈ శాశ్వత ప్రణాళికపై ఎనిమిది వారాల్లోపు ముసాయిదాను కోర్టుకు సమర్పించాలని గడువు విధించింది. భక్తులు హుండీలో సమర్పించే కానుకలు వారి విశ్వాసానికి ప్రతీక అని, వాటిని కాపాడాల్సిన నైతిక, ధార్మిక బాధ్యత టీటీడీ ధర్మకర్తల మండలిపై ఉందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియలో ఏ చిన్న లోపం జరిగినా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న రవికుమార్, అతని కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను వారంలోపు సీల్డ్ కవర్‌లో సమర్పించాలని ఏసీబీ డీజీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

## గాజాలో శాంతి దళాలు..

# పాకిస్థాన్ నిర్ణయాన్ని స్వాగతించిన అమెరికా

ఢిల్లీ: గాజాలో యుద్ధం ముగిసిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు అంతర్జాతీయ స్థిరీకరణ దళాన్ని ఏర్పాటు చేసేందుకు అమెరికా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ దళంలో భాగస్వామి అయ్యేందుకు పాకిస్థాన్ సుముఖత వ్యక్తం చేయడంపై అమెరికా కృతజ్ఞతలు తెలిపింది. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నందుకు పాకిస్థాన్‌కు ఎంతో రుణపడి ఉంటామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై పాకిస్థాన్‌తో పాటు ఇతర దేశాలతో చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని తెలిపారు. "ఈ దళంలో చేరాలనుకుంటున్న దేశాలు, వాటి విధివిధానాలు, నిధుల సమీకరణ, అధికార పరిధి వంటి అంశాలపై స్పష్టత కోరుతున్నాయి. ఈ విషయాలపై మేము వారికి పూర్తి వివరాలు అందించాల్సి ఉంది" అని రూబియో వివరించారు. అవసరమైన స్పష్టతనిస్తే, ఈ ఘర్షణలో భాగం కాని అనేక దేశాలు స్థిరీకరణ దళంలో చేరడానికి ముందుకు వస్తాయన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని ఆయన పేర్కొన్నారు. "ఒకవేళ పాకిస్థాన్ అంగీకరిస్తే అది చాలా కీలకం అవుతుంది. అయితే తుది నిర?యం తీసుకునే ముందు వారికి మరిన్ని సమాధానాలు ఇవ్వాలి" అని ఆయన అన్నారు. గాజాలో రోజువారీ పాలన కోసం పాలస్తీనా టెక్నోక్రాట్లతో 'బోర్డ్ ఆఫ్ పీస్' ఏర్పాటు చేయడమే తదుపరి చర్య అని రూబియో వెల్లడించారు. ఈ పాలకవర్గం ఏర్పాటయ్యాకే స్థిరీకరణ దళం నిధులు, నిబంధనలు, నిరాయుధీకరణలో వారి పాత్ర వంటి అంశాలపై తుది నిర?యం తీసుకుంటామని స్పష్టం చేశారు. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడుల తర్వాత గాజాలో సంక్షోభం మొదలైన విషయం తెలిసిందే. గాజాలో హమాస్ మళ్లీ సైనిక శక్తిగా ఎదగకుండా నిరోధించడం, పౌర పాలన, పునర్నిర్మాణాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా అమెరికా ఈ దౌత్యపరమైన చర్యలు చేపడుతోంది.

## మళ్లీ అధికారంలోకి వస్తే

# ఏం చేయాలో జగన్‌కు పక్కా ప్లాన్ ఉంది: సజ్జల

వైసీపీ అధినేత జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు.అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు.

# 11.49 కోట్ల మందిలో 1.71 కోట్ల పేర్లు తొలగింపు

న్యూఢిల్లీ: తమిళనాడు, గుజరాత్‌లలో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనంతరం 1.71 కోట్ల ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో లేవని ఎన్నికల కమిషన్ తెలిపింది. రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఓటర్లు 11.49 కోట్లు కాగా, వీరిలో 9.78 కోట్ల మంది పేర్లు తాజాగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఉన్నాయని శుక్రవారం ఈసీ వివరించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన తమిళనాడులో మొత్తం ఓటర్లు 6.41 కోట్ల మంది కాగా, 84.81 శాతం మంది అంటే, 5.43 కోట్ల మంది బూత్ లెవెల్ అధికారులకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేశారని తెలిపింది. మిగతా సుమారు 97.37 లక్షల పేర్లు తొలగింపునకు గురయ్యాయంది. అదేవిధంగా, గుజరాత్‌లో మొత్తం ఓటర్లు 5.08 కోట్ల మంది కాగా, 85.50 శాతం మంది, 4.34 కోట్ల మంది ఎన్యుమరేషన్ ఫాంలు అందజేసినట్లు ఈసీ వివరించింది. మిగతా 73.74 లక్షల మంది పేర్లు ఓటరు జాబితా ముసాయిదా నుంచి తొలగింపునకు గురయ్యాయని తెలిపింది. 2026 జనవరి 18వ తేదీ వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం ఉందని పేర్కొంది. ఫిబ్రవరి 10వ తేదీ వరకు వీటిని పరిశీలిస్తారంది. ఎస్ఐఆర్ కొనసాగుతున్న పశ్చిమబెంగాల్, రాజస్తాన్, గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఈ నెల 16వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటిస్తామంది. ఇక్కడ మొత్తం 12.32 కోట్ల మంది ఓటర్లు ముసాయిదాలో తమ పేర్లు ఉన్నాయోలేదో చూసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితాను http://ceo. gujarat.gov.in అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపింది.

## సహజీవనంపై హైకోర్టు కీలక తీర్పు..

# ఎవరికి ఓకే? ఎవరికి కాదు?

ఢిల్లీ: దేశంలో సహజీవనం (లివ్-ఇన్ రిలేషన్‌షిప్)పై జరుగుతున్న చర్చకు మరింత స్పష్టతనిస్తూ అలహాబాద్ హైకోర్టు రెండు కీలక తీర్పులను వెలువరించింది. అవివాహితులైన మేజర్లు కలిసి జీవించడం చట్టవిరుద్ధం కాదని, వారి ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని తేల్చిచెప్పింది. అదే సమయంలో, మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా మరొకరితో సహజీవనం చేయడం నేరమని, అటువంటి వారికి రక్షణ కల్పించలేమని స్పష్టం చేసింది. జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వేర్వేరు తీర్పులను ఇచ్చింది. తమ కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ సహజీవనం చేస్తున్న 12 మంది అవివాహిత మహిళలు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, వారికి తక్షణమే భద్రత కల్పించాలని సంబంధిత జిల్లాల పోలీసు అధికారులను ఆదేశించింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "సహజీవనం అనే భావన అందరికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చు, కానీ దాన్ని చట్టవ్యతిరేకమని చెప్పలేం. మేజర్లయిన ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించాలని నిర్ణయించుకున్నప్పుడు వారి నిర్ణయాన్ని ప్రశ్నించడం కోర్టుల పని కాదు. వివాహం చేసుకోలేదన్న కారణంతో రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును నిరాకరించలేం" అని ధర్మాసనం పేర్కొంది. సహజీవనాన్ని మన సమాజం ఇంకా పూర్తిగా ఆమోదించలేదని, కొందరికి ఇది అనైతికంగా అనిపించవచ్చని కోర్టు అంగీకరించింది. అయితే, పాశ్చాత్య భావాలను స్వీకరించడానికి భారతదేశం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, లివ్-ఇన్ రిలేషన్‌షిప్ కూడా అలాంటిదేనని వ్యాఖ్యానించింది.

వివాహితులకు రక్షణ నిరాకరణ

మరోవైపు, ఇదే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌పై జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ ధర్మాసనం భిన్నమైన తీర్పు ఇచ్చింది. ఇప్పటికే వివాహమై భార్య ఉన్న ఓ వ్యక్తి, మరో మహిళతో సహజీవనం చేస్తూ తనకు రక్షణ కల్పించాలని కోర్టును ఆశ్రయించాడు. ఈ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. "వ్యక్తిగత స్వేచ్ఛ సంపూర్ణమైనదేమీ కాదు. మొదటి భార్యకు ఉన్న చట్టబద్ధమైన హక్కులను కాలరాయలేరు. ఆమెకు విడాకులు ఇవ్వకుండా మరొకరితో సహజీవనం చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసు రక్షణ కల్పించలేం" అని కోర్టు స్పష్టం చేసింది. ఈ రెండు తీర్పుల ద్వారా సహజీవనం విషయంలో చట్టపరమైన పరిధులను అలహాబాద్ హైకోర్టు స్పష్టంగా నిర్దేశించింది.

# 'కేసీఆర్ ఎలా ఉన్నారు?'..

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆరోగ్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ఆరా తీశారు. తనను కలిసిన బీఆర్ఎస్ ఎంపీలతో 'కేసీఆర్ ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది? జాగ్రత్తగా చూసుకోమని చెప్పండి. ఈ మాట నేను ప్రత్యేకంగా చెప్పానని ఆయనకు తెలియజేయండి" అని మోదీ సూచించారు. శుక్రవారం పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిరిసిల్ల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి-365బిని వేములవాడ మీదుగా కోరుట్ల వరకు పొడిగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే కేంద్రం దృష్టికి తెచ్చారని, గతంలో కేంద్ర మంత్రి ఒకరు హామీ ఇచ్చారని వారు ప్రధానికి గుర్తుచేశారు. ఈ రహదారి విస్తరణతో వేములవాడ క్షేత్రానికి ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతుందని వివరించారు. ఈ క్రమంలో మిడ్ మానేరుపై ధవళేశ్వరం తరహాలో రోడ్ కమ్ రైల్ బ్రిడ్జి నిర్మించాలని, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పనుల్లో సహకరించాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలన్నీ విన్న తర్వాత ప్రధాని మోదీ.. కేసీఆర్ బాగోగుల గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.

# సంప్రదాయ వైద్యానికి సముచిత స్థానం దక్కాలి

న్యూఢిల్లీ: సంప్రదాయ వైద్యానికి సరైన గుర్తింపు ఇప్పటికీ లభించలేదని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఈ వైద్య విధానం తన పరిధిని మరింతగా విస్తరించుకోవాలంటే, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలవాల్సి ఉందని చెప్పారు. సంప్రదాయ వైద్యంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ప్రధాని ప్రసంగించారు. డిజిటల్ సాంకేతికతను వాడుకుంటూ పరిశోధనలను మరింతగా విస్తరించుకుంటూ సంప్రదాయ వైద్యం తన పరిధిని పెంచుకోవాలని సూచించారు. లైఫ్‌స్టయిల్ విధానాలకు మాత్రమే సంప్రదాయ వైద్య పరిమితమనే నమ్మకం ఒకప్పుడు ఉండేది. ఈ ఆలోచనాధోరణిలో వేగంగా మార్పువచ్చింది. క్లిష్టమైన సందర్భాల్లో సైతం సంప్రదాయ వైద్య విధానాలు నేడు ప్రభావవంతంగా ఉంటున్నాయి. ఇదే దృక్పథం భారత్‌లోనూ ఉంది'అని ప్రధాని మోదీ చెప్పారు. 'ఒకప్పుడు ప్రపంచంలోని అత్యధిక ప్రాంతంలో సంప్రదాయ వైద్యానికే పెద్దపీట వేసేవారు. అయినప్పటికీ, దీనికి దక్కాల్సిన స్థానం ఇప్పటికీ దక్కలేదు. సైన్స్ ద్వారా నమ్మకాన్ని పెంచుకోవాలి. మరింతగా ప్రజాబాహుళ్యంలోకి వెళ్లాలి'అని అన్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాల్లో కీలకంగా ఉన్న అశ్వగంధకు కోవిడ్ మహమ్మారి సమయంలో అంతర్జాతీయంగా డిమాండ్ వచ్చిందన్నారు. భారత వైద్య నిపుణులు అమూల్యమైన పరిశోధనలు, సాధించిన ప్రమాణాల ఫలితంగా అశ్వగంధకు సముచిత స్థానం దక్కిందని వివరించారు. ఇలాంటి మూలికలకు ప్రపంచ ఆరోగ్య రంగంలోభాగంగా మారేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రకటించారు. సంప్రదాయ వైద్యానికి అంగీకార యోగ్యతను కల్పించడం దేశాల బాధ్యతని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మై ఆయుష్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ పోర్టల్(ఎంఏఐఎస్‌పీ)ని ప్రారంభించారు. ఆయుష్ ఉత్పత్తులు, సేవల నాణ్యతను నిర్ధారించే ఆయుష్ మార్క్‌ను ఆవిష్కరించారు. అశ్వగంధపై తపాలా స్టాంపును విడుదల చేశారు. డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయెసుస్, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, ప్రతాప్‌రావ్ జాదవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ..

# రాష్ట్రాభివృద్ధి, రాజకీయాలపై చర్చ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో కీలక సమావేశం నిర్వహించారు. నిన్న రాత్రి ఢిల్లీలోని తాజ్ హోటల్‌లో వీరిద్దరి భేటీ జరిగింది. రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతిని చంద్రబాబు అమిత్ షాకు వివరించారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు అదుతమైన స్పందన వచ్చిందని, లక్షల కోట్ల రూపాయల విలువైన అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయని తెలిపారు. గత జగన్ ప్రభుత్వ విధ్వంసక పాలన కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుదేలైందని, రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్రం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు తాను కలిసిన పలువురు కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాల వివరాలను కూడా చంద్రబాబు అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధి అంశాలతో పాటు, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై కూడా ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు సమాచారం.

## హైదరాబాద్‌లో మారనున్న

# 3 వేల కాలనీల చిరునామాలు!

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం స్వరూపం మరోసారి మారబోతోంది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, ఏకరూప పాలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శివారులోని 20 మున్సిపాలిటీలు, 7 నగర పాలక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసింది. ఈ విలీనం కారణంగా సుమారు 3 వేల కాలనీల చిరునామాలు మారనున్నాయి. అంతేకాకుండా, 100కు పైగా కొత్త డివిజన్లు ఏర్పాటయ్యాయి. ఈ విలీనంతో జీహెచ్ఎంసీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతంలో 650 చదరపు కిలోమీటర్లుగా ఉన్న గ్రేటర్ పరిధి ఇప్పుడు 2053 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం డిసెంబర్ 1న ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ విలీన ప్రక్రియ, డివిజన్ల పునర్విభజనను జీహెచ్ఎంసీ అధికారులు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో పూర్తి చేశారు. కొత్త డివిజన్ల ఏర్పాటు, వాటి హద్దులపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను, ఫిర్యాదులను అధికారులు పరిశీలించారు. శివరాంపల్లిని సులేమాన్‌నగర్‌లో కలపడం వంటి పలు అంశాలపై వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని హద్దుల్లో మార్పులు చేశారు. దీనికి సంబంధించిన తుది నివేదికను సోమవారం ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం ఫైనల్ గెజిట్‌ను విడుదల చేస్తుంది. అయితే, ఇంత పెద్ద నగరాన్ని ఒకే గొడుగు కింద పాలించడంపై ప్రభుత్వం పునరాలోచనలో ఉంది.

# ప్రశాంతంగా ముగిసిన మన్యం బంద్

**- పోలవరం జిల్లాలో ఏలూరు జిల్లాలోని ఆదివాసీ గ్రామాలను చేర్చాలి**

**- రాస్తా రోకో,బైక్ ర్యాలీ నిర్వహించిన పోలవరం జిల్లా సాధన కమిటీ నాయకులు**

కుక్కునూరు డిసెంబర్ 22 : గాయత్రి వార్తలు

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లోని ఉన్న మండలాలు లేకపోవడం సిగ్గుచేటని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు కార్యదర్శి శ్యామల లక్ష్మణరావు, పట్ల లక్ష్మయ్య, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కురం సంజీవరావు డిమాండ్ చేశారు. సోమవారంకుక్కునూరు మండలంలో నిర్వహించిన బంద్ లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు,వర్తక వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంక్, గ్యాస్ గోడం స్వచ్ఛంద మద్దతు తెలియజేస్తూ మూసివేశారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లో బంద్ లో భాగంగా జరిగిన రాస్తారోకో,బైక్ ర్యాలీని ఉద్దేశించి శ్యామల లక్ష్మణరావు, పట్ల లక్ష్మయ్య, కురం సంజీవ్ రావుమాట్లాడుతూ పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లోని ఉన్న మండలాలు లేకపోవడం సిగ్గుచేటని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పోలవరం జిల్లా చేస్తానని ప్రకటించి పోలవరం జిల్లాలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న మండలాల కలుపుతూ జిల్లా చేశారు, కానీ పోలవరం లోని ఉన్న మండలాలు,పోలవరం,బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి,వేలేరుపాడు,కుక్కునూరు వ ం రి య ్ ం ం టీ.నర్సాపురం,గోపాలపురం,కోయలగూడెం మండలాలలో ఉన్న గిరిజన గ్రామాలు జంగారెడ్డిగూడెం లో ఉన్న గిరిజన గ్రామాలను చేర్చకపోవడం గిరిజనులను మోసం చేయడేమెనని విమర్శించారు. ఏలూరు జిల్లాలో ఉన్న పోలవరం నియోజకవర్గం, మిగిలిన ప్రాంతాల్లో ఉన్న గిరిజన గ్రామాలను పోలవరం జిల్లాలో చేర్చాలని, వారు డిమాండ్ చేశారు. తద్వారా,నిర్వాసితులు,ఆదివాసీలు,ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉంటుందని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న నిర్వాసితులను సైతం జీలుగుమిల్లి బుట్టాయిగూడెం మండలాల్లో పెట్టారు ఇప్పుడు పోలవరం జిల్లాలోని పోలవరం నియోజకవర్గంలో ఉన్న గ్రామాలు లేకపోవడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ఈ బంద్ ఏజెన్సీ మొత్తం విజయవంతంగా అయిందని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అలాగే ఎమ్మెల్యే అసెంబ్లీలోని పట్టుబట్టి సాధించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెలకొట్టుకోవాలని లేనిపక్షంలోని మరింత ఉధృత ఉద్యమాలు కొనసాగిస్తామని వారు డిమాండ్ చేశారు. ఈ బంద్ కు సీపీఎం,సిఐటియు, ఎస్.ఎఫ్.ఐ తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ బంద్ లో పాల్గొన్నారు. ఈ బంద్ లో సీపీఎం మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు వేణు, గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు కాక ఆనంద్, ఎస్.ఎఫ్.ఐ మండల అధ్యక్షులు,కార్యదర్శి నవదీప్, వర్క లక్ష్మణ్ కుమార్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు జెడ్డి రఘు,నాగార్జున, సర్పంచ్ కంటిపల్లి రామకృష్ణ, వర్స లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలే లక్ష్యం: శ్రీకాళహస్తి పోలీసుల ముందస్తు చర్యలు

శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు డిసెంబర్ 22: రిపోర్టర్ : మునిరత్నం



తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు గారి ఆదేశాల మేరకు, శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రకాశ్ కుమార్ ఆధ్వర్యంలో, ఎస్సై రవికుమార్ నేతృత్వంలో ఈ ప్రత్యేక తనిఖీలు క్రమబద్ధంగా కొనసాగాయి. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో తాగి వాహనం నడిపే వారిని గుర్తించేందుకు ఆటోలు, ద్విచక్ర వాహనదారులపై బ్రీత్ అనలైజర్లతో సుదీర్ఘ తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా డిసెంబర్ 31 వేడుకల సమయంలో యువత మద్యం సేవించి వాహనాలు నడిపే అవకాశాలు ఎక్కువగా ఉండటాన్ని ముందుగానే అంచనా వేసి, ప్రమాదాలను నివారించాలనే సంకల్పంతో ఈ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల ఉద్దేశ్యం శిక్షించడం మాత్రమే కాకుండా ప్రతి వాహనదారుడి కుటుంబ భద్రతను దృష్టిలో ఉంచుకొని, ప్రాణనష్టం జరగకుండా కాపాడటమేనని పోలీసులు స్పష్టం చేశారు. అందుకే డిసెంబర్ 31 వరకు ప్రతిరోజూ తనిఖీలు కొనసాగిస్తూ, తాగి వాహనం నడపాలంటేనే భయపడే విధంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలే ప్రథమ లక్ష్యంగా, ముందస్తు చర్యలతో ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తున్న శ్రీకాళహస్తి పోలీసుల కర్తవ్యనిష్ఠ, సమయోచిత నిర్ణయాలు ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ తనిఖీలకు వాహనదారులు సంపూర్ణ సహకారం అందించి, ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# శ్రీకాళహస్తి నారాయణ పాఠశాలలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు, డిసెంబర్ 22:రిపోర్టర్ : మునిరత్నం

శ్రీకాళహస్తి పట్టణంలోని నారాయణ పాఠశాల లో గణిత దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి మండల విద్యా శాఖాధికారి భువనేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన నమూనాలు, చార్ట్లు, గణిత పజిల్స్‌తో కూడిన ప్రదర్శనలు ఏర్పాటు చేసి తమ ప్రతిభను చాటారు. గణిత శాస్త్రం దైనందిన జీవితంలో ఎంతటి ప్రాముఖ్యత కలిగి ఉందో విద్యార్థులకు అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.ముఖ్య అతిథి భువనేశ్వరి మాట్లాడుతూ, విద్యార్థుల్లో తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో గణితానికి కీలక పాత్ర ఉందని తెలిపారు. ఈ తరహా విద్యా



కార్యక్రమాలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీస్తాయని ఆమె అభినందించారు. ఈ గణిత శాస్త్రానికి సంబంధించిన ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, తిరుపతి జిల్లా శ్రీనివాసులు, కిరణ్, ఈ ఛాంప్స్ జిల్లా కోర్డినేటర్ గాయత్రి, పాఠశాల డీన్ కేదర్ శృతి, సురేష్, గణిత ఉపాధ్యాయ బృందం గురవయ్య అమరావతి, మోజీలు, విజయలక్ష్మి, ధనలక్ష్మి, చంద్రిక, అంబిక మరియు విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు విజయవంతం

**- ఫైనల్లో గూడూరు డివిజన్ ఘన విజయం**

శ్రీకాళహస్తి, డిసెంబర్ 22 గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్



ఉపాధ్యాయుల్లో క్రీడాస్ఫూర్తి, శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో తిరుపతి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లు అత్యంత ఉత్సాహభరితంగా, ఉత్కంఠభరితంగా సాగాయి.జిల్లాలోని వివిధ డివిజన్లకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఫైనల్ మ్యాచ్‌లో గూడూరు డివిజన్ జట్టు అద్భుతమైన ఆటతీరుతో విజేతగా నిలవగా, చివరి వరకు గట్టిపోటీ ఇచ్చిన శ్రీకాళహస్తి డివిజన్ జట్టు రన్నర్ అప్‌గా నిలిచింది.విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ కె.వి.ఎన్. కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతగా నిలిచిన గూడూరు డివిజన్ జట్టుకు, రన్నర్ అప్‌గా నిలిచిన శ్రీకాళహస్తి డివిజన్ జట్టుకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనడం ప్రశంసనీయమని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు ఉపాధ్యాయుల్లో ఐక్యత, పరస్పర స్నేహబంధాలు, క్రీడాస్ఫూర్తి, మానసిక ఉల్లాసం మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సమగ్ర శిక్ష సి.ఎం.ఓ సురేష్, ఐటీ సెల్ అధికారి ధనుంజయ నాయుడు, ఎస్.జి.ఎఫ్ జిల్లా కార్యదర్శి కిశోర్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలలో వైయస్ జగన్ పుట్టినరోజు వేడుకలు

ఏర్పేడు, గాయత్రి వార్తలు: రిపోర్టర్ : మునిరత్నం



శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండల పరిధిలోని గుండ్ల కండ్రిగ గ్రామంలో ఆదివారం రాత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండల ఇన్‌చార్జి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చుతూ ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు జయముని, రాజా, గుండయ్య, తులసి, సాంబయ్య, అనిల్ తదితరులు పాల్గొని జగన్మోహన్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పార్టీని అభిమానించే యువకులు, మహిళలు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు మరింత శోభ చేకూర్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి పాలనలో అమలైన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంని కలపాలని చేపట్టిన బంద్ విజయవంతం

వేలేరుపాడు మండలం గాయత్రి వార్తలు:-






రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల పునర్విభజన లో భాగంగా పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా ప్రకటించిన ప్రభుత్వం,పోలవరం నియోజకవర్గ లేకపోవడంతో జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో పోలవరం నియోజకవర్గ ఏజెన్సీ ప్రాంతాన్ని కలపాలని బంద్ నిర్వహించడం జరిగింది. మండల కేంద్రం నుండి సాధన కమిటీ ఆధ్వర్యంలో గుల్లవయి సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.అనంతరం అంబేద్కర్ సెంటర్లో సదస్సు జిల్లా సాధన కమిటీ సభ్యులు మడివి దుర్గారావు అధ్యకతన జరిగింది. నాయకులు ధర్మల రమేష్, ఊకె ముత్యాలరావు, సొడే సీతారామయ్య, కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, పొట్ల మోహన్, మిరియాల శ్రీను, కట్టి ఉదయ్ లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసిత ప్రాంతాన్ని అంతటినీ ఒక జిల్లాగా ప్రకటిస్తానని ఇచ్చిన హామీ విస్మరించి, పోలవరం నియోజకవర్గంలో లేకుండా పోలవరం జిల్లాని ప్రకటించటం నియోజకవర్గ ప్రజలను నిరాశ పరచడమేనని విమర్శించారు. నియోజకవర్గం లో నిర్వాసితుల సమస్యలు పరిస్కారం అవ్వాలన్న, ఈ ప్రాంతం అభివృద్ధి అవ్వాలంటే పోలవరం నియోజకవర్గంని కలిపి పోలవరం జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కారటం ప్రకాష్, కుడియం రాజు, రాంబాబు, ప్రేమాకుమార్, కొత్త వెంకటేశ్వర్లు, మల్లేష్, నాగు రాముడు తదితరులు ఉన్నారు.

# శివకాళి శక్తి పీఠాధిపతి మోహన నంద స్వామికి ఘన స్వాగతం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 22, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్



కంచి పీఠాధిపతులు, శివకాళి శక్తి పీఠం శ్రీ శ్రీ శ్రీ మోహన నంద స్వామీ సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి మరియు అమ్మవార్ల దర్శనార్థం శ్రీకాళహస్తి క్షేత్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిపూర్వకంగా దర్శనం చేయించారు. స్వామీజీకి తంగేళ్లపాలెం సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ , ఖాదర్, చందు మహేష్ లు దగ్గరుండి దర్శనం చేయించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించగా, ఆలయ సంప్రదాయం మేరకు స్వామి అమ్మవార్ల జ్ఞాపికను స్వామీజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామీజీ ఆశీర్వాదాలు పొందారు.

# విధి నిర్వహణలో అంకితభావం మురళీధర్ రెడ్డికి ఘన నివాళులు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 22, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందిన పి. మురళీధర్ రెడ్డికి పట్టణ వైఎస్ఆర్సిపి యువజన అధ్యక్షులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి నివాళులు అర్పించారు. డిసెంబర్ 12న మురళీధర్ రెడ్డి అకస్మాత్తుగా మృతి చెందగా, సోమవారం నిర్వహించిన కర్మక్రియల్లో మునికృష్ణారెడ్డి పాల్గొని మృతుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మురళీధర్ రెడ్డి ఎంతో అంకితభావంతో పనిచేసేవారని, సహచరులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించే మంచి వ్యక్తిత్వం కలిగిన అధికారి అని కొనియాడారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు పరగాడ సంతాపం తెలియజేస్తూ, ఈ అపార నష్టాన్ని దేవుడు వారికి తట్టుకునే శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లాలో రౌడీయిజం, గంజాయి మరియు మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపిఎస్





**గుంటూరు జిల్లా గాయత్రి వార్తలు**

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, జిల్లాలో రౌడీయిజం, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ మరియు హిస్టరీ షీట్ కలిగిన వ్యక్తులు, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ను ఈ రోజు నిర్వహించారు. ఇకపై ఎవరైనా మళ్లీ నేరాలకు పాల్పడినా లేదా గంజాయి తదితర మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీస్ అధికారులు స్పష్టంగా హెచ్చరించారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు కలిగిన వ్యక్తులు మరియు గంజాయి కేసుల నిందితులపై నిరంతర నిఘా కొనసాగుతున్నదని తెలిపారు. వారి జీవన విధానం, ఉపాధి, నివాస ప్రాంతాలు తదితర వివరాలను పోలీస్ డేటాబేస్‌లో నమోదు చేసి, వారి రోజువారీ కార్యకలాపాలపై పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించిన రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ లేదా హిస్టరీ షీట్ కలిగిన వ్యక్తులపై తగిన కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయం లేదా సరఫరా చేస్తూ పట్టుబడిన వారి ఆస్తులను సీజ్ చేయడంతో పాటు, గంజాయి మూలాలు, సరఫరాదారులు, వినియోగదారుల వివరాలను సేకరించి అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీ షీటర్లు మరియు గంజాయి కేసుల నిందితులపై నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, న్యాయస్థానాల్లో త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచి ప్రవర్తనతో జీవిస్తే కేసుల తీవ్రతను బట్టి కొంత మేర న్యాయపరమైన ఉపశమనం లభించే అవకాశం ఉంటుందని, అయితే ఒకసారి రౌడీ షీట్ లేదా గంజాయి కేసులో ఇరుక్కుంటే ఆ ముద్ర జీవితాంతం వెంటాడుతుందని గుర్తు చేశారు. యువత చెడు అలవాట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే నేరాల వైపు దారి తీస్తుందని హెచ్చరించారు. చదువు, క్రీడలు మరియు సానుకూల కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్లలో నిర్వహించే కౌన్సెలింగ్ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరవ్వాలని, ఆ వారం వారు చేసిన కార్యకలాపాలపై ఆరా తీస్తామని తెలిపారు. ఎవరైనా గైర్హాజరైతే, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు లేదా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కార్యకలాపాలకు పదేపదే పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడంతో పాటు, అవసరమైతే నగర బహిష్కరణ చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. నగర, పట్టణ, గ్రామ శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లు, చెట్ల పొదలు, కాలువ కట్టలు తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిరంతర గస్తీ కొనసాగుతున్నదని, అక్రమార్కులు ఎక్కడ ఉన్నా పోలీసుల నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో, కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని, చెడు అలవాట్లు మరియు వ్యాసనాలకు దూరంగా ఉంటూ సమాజంలో గౌరవంగా జీవించాలని పోలీస్ అధికారులు హితవు పలికారు.

# "పల్నాడు జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షునిగా: SK జానీ





**పలనాడు జిల్లా గాయత్రి వార్తలు పేపర్ 22/12/ డిసెంబర్**

మైనార్టీ కి ప్రాధాన్యత ఇచ్చేది ఒక్క టిడిపి మాత్రమే అని మరోసారి రుజువు చేసిన తెలుగుదేశం పార్టీ,గత 10 ఏళ్లుగా పార్టీకోసం అనేక కేసులుపెట్టించు కొని ,మైనార్టీ ,బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేసిన %ం౧% జానీ (అమరావతి )నేడు అధిష్టానం నరసరావుపేట పార్లమెంటరీ పార్టీ అధ్యక్షునిగా ప్రకటించడం అభినందనీయం,ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు మఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ ,పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు జానీ .

# మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు నూతన ఎస్సైలు పోస్టింగ్



**గుంటూరు జిల్లా గాయత్రి వార్తలు**

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముగ్గురు ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపిన గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ముగ్గురు ఎస్సైలు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రొఫెషనల్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఎస్సై బి. హరికృష్ణ దుగ్గిరాల పోలీస్ స్టేషన్), ఎస్సై సంఘ సురేష్ కొల్లిపర పోలీస్ స్టేషన్ మరియు ఎస్సై బి. రవితేజ (తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్)లను మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ చేయగా, వారు ఆదివారం అధికారికంగా గ్రామీణ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ కు రిపోర్టు చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముగ్గురు ఎస్ఐలకు ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ, మంగళగిరి రూరల్ ప్రాంతంలో ప్రజల భద్రత, శాంతి భద్రత పరిరక్షణకు ప్రతి ఎస్సై తన బాధ్యతలను సమగ్రంగా, నిబద్ధతతో నిర్వర్తించాలి అని సూచించారు. అలాగే, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల అదుపు, సామూహిక మరియు వ్యక్తిగత సమస్యల పరిష్కారంలో ప్రజలతో సమన్వయం, సానుకూల ఆచరణ చాలా ముఖ్యం అని ఆయన గుర్తుచేశారు., "ముగ్గురు ఎస్సైలు బాధ్యతను పూర్ణ నిబద్ధతతో నిర్వర్తిస్తే, మంగళగిరి రూరల్ ప్రాంతం నేర రహిత, భద్రమైన పరిసరంగా మారుతుందని ఆశిస్తున్నాము" అని గ్రామీణ ఎస్సై వెంకట్ తెలిపారు.. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు మాట్లాడుతూ, మంగళగిరి రూరల్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయడంతో పాటు నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తామని వారు స్పష్టం చేశారు. ప్రజలతో సమన్వయం పెంచుకుని, చట్టపరమైన అవగాహన కల్పిస్తూ, నేరరహిత మంగళగిరి రూరల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎస్సైలు పేర్కొన్నారు.

# "గురజాలలో. ఉద్రిక్తత"






**పల్నాడు జిల్లా: గాయత్రి వారగాయత్రి వార్తలు**

పంచాయతీ నుంచి వైసీపీకి బలమైన గ్రామం జంగమహేశ్వపురాన్ని తొలగించాలని టిడిపి తీర్మానం.జంగమహేశ్వరపురం తొలగింపు పై ఇవాళ నగర పంచాయతీలో ఓటింగ్.నగర పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లిపోయిన తెలుగుదేశం సభ్యులు.వైసీపీ చైర్మన్ పోలు పవన్ మై నీ పంచాయతీ కార్యాలయంలోకి వెళ్ళనివ్వకుండా గేటు దగ్గరే అడ్డుకున్న పోలీసులు.చైర్మన్ ను ఎందుకు అడ్డుకున్నారని వాగ్వాదానికి దిగిన వైసిపి కౌన్సిలర్లు. వైసీపీ సభ్యులను లోపలికి వెళ్ళనివ్వకుండా ఓవరాక్షన్ చేస్తున్న పోలీసులు..పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు.కౌన్సిలర్లు అందరూ మున్సిపల్ సమావేశానికి వెళ్లినప్పటికీ చైర్మన్ గేటు బయటే నిలిపివేసిన పోలీసులు

# ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం వేడుకలు.



**ఈపూరు డిసెంబర్ 22 గాయత్రి వార్తలు**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అగ్నిగుండాలలో ప్రధానోపాధ్యాయులు కేళావతు శివకుమార్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం గణిత దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎక్సిబిషన్,డిబేట్ తదితర కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించారి గణిత ఎక్సిబిషన్ తల్లిదండ్రులు,విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. శివకుమార్ నాయక్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ అసాధారణ భారతీయ గణిత శాస్త్రవేత్తని,అపారమైన మేధసుతో వేలాది గణిత,సంఖ్యా సిద్ధాంతాలు,మ్యాజిక్ స్క్వేర్స్ తదితర సమీకరణాలను కనుగొన్నారని కొనియాడారు. మోడల్ ప్రైమరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలుసుపాటి సత్యనారాయణ,పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు తావూరియా నాయక్,సుభానీలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,శైలజ, సుచిత్ర,శరత్ కుమార్,మధుకిరణ్,తులసి లక్ష్మి,సుజాత,శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు పంపిణీ





**అమరావతి,పెదకూరపాడు గాయత్రి వార్తలు**

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అమరావతి,పెదకూరపాడు మండలాలకు చెందిన 32 మందికి 20,38,638 రూపాయల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే. ముఖ్యమంత్రి సహాయ నిధి పెదాలకు మరింత భరోసాగా నిలుస్తుందన్న ఎమ్మెల్యే. పెద్దలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నగదు అందించడం సంతోషకరమన్న ఎమ్మెల్యే. రానున్న ఆరోజుల్లో కూడా కష్టాల్లో ఉన్న పేదలకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే.

# కృషి పట్టుదల ఉంటే ప్రతి ఒక్కరూ ప్రయోజకులవుతారు- శిరీష

**పెదకూరపాడు డిసెంబర్ 22 గాయత్రి వార్తలు**

ఒక భారతీయుడు గణిత శాస్త్రజ్ఞుడు సంఖ్యా సిద్ధాంతంలో సుప్రసిద్ధుడు శ్రీనివాస రామానుజ అని శ్రీ వివేకానంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ శిరీష అన్నారు. సోమవారం సుమారు 200 మంది విద్యార్థులతో గణిత శాస్త్ర ఎగ్జిబిషను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీష మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు శుద్ధ గణితంలో ఈయనకు శాస్త్రీయమైన శిక్షణ లేకపోయినా గణిత విశ్లేషణ, సంఖ్యా శాస్త్రం, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేసిన వ్యక్తి రామానుజమని ఆమె అన్నారు. విద్యార్థులు కృషి పట్టుదలతో ఎన్నో ప్రయోగాలు చేసి ఎగ్జిబిషన్ ని ఏర్పాటు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచారన్నారు. ఈ ఎగ్జిబిషన్ తయారీకి సహకరించిన గణిత ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అంటే ఆటపాటలతో పాటు జ్ఞానం,విజ్ఞానం, గణితం, నేర్చుకొని విద్యారంగంలో గొప్పగా ఎదగాలన్నారు. కృషి పట్టుదల ఉంటే మీలో ప్రతి ఒక్కరూ రామానుజమే అన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు తులసి కావ్య పద్మ నాగరాజు త్రివేణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ నాగేశ్వరరావు జనార్ధనలు పాల్గొన్నారు.

***GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.